

# కనరో.. కనులార స్వామిని!

కోరిన వరాలిచ్చే కల్పవృక్షమే స్వామికి వాహనంగా మారింది. బంగారు కాంతుల ధగధగల నడుమ మాడవీధుల్లో దేవేరులతో కలిసి వేణుగోపాల రూపుడై శ్రీనివాసుడు సోమవారం ఉదయం విహరించాడు. సాయంత్రం సకల దిక్కుల రాజులే స్వామికి వాహనమయ్యారు. సర్వభూపాల వాహనంలో కాళీయమర్దనుడై భక్తులకు దర్శనమిచ్చాడు. మంగళవారం నాడు స్వామి మెడలో అలరారడానికి శ్రీవిల్లిపుత్తూరు నుంచి గోదాదేవి మాలలూ, చెన్నై నుంచి 11 గొడుగులూ కూడా తిరుమలకు చేరుకున్నాయి. వందలాది మంది కళాకారుల నృత్యగానాలతో మాడవీధులు మనోహరంగా భాసిల్లాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

# నేడే గరుడ సేవ

తిరుమల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ఐదో రోజైన మంగళవారం సాయంత్రం 6.30 గంటలకు గరుడ వాహన సేవ మొదలై రాత్రి 11.30 గంటల వరకు జరగనుంది. పెరటాశి మాసం చివరి వారం కావడంతో గరుడ సేవకు భక్తులు భారీగా వస్తారని టీటీడీ అంచనా వేస్తోంది. బ్రహ్మోత్సవాల్లో గరుడసేవకు విశిష్ట స్థానం ఉంది. ఆలయంలోని మూలవర్లకు అలంకరించే సహస్రనామమాల, లక్ష్మీహారం, మకరకంఠి, పచ్చ, సూర్యకఠారి, ప్రభుత్వం సమర్పించిన నూతన పట్టువస్త్రాలు తదితరాలతో గరుత్మంతుడిని అధిరోహించే మలయప్పకు అలంకరించడం విశేషం. చెన్నైకి చెందిన అంబ్రెల్లా చారిటీస్ సమర్పించే గొడుగులను ఉపయోగిస్తారు. అందుకే ఈ వాహనంలో మూలమూర్తి అవహించి భక్తులను అనుగ్రహిస్తారని ఐతిహ్యం. మహావిష్ణువుకు ప్రధాన వాహనమైన వైనతేయుడికి ఉత్సవాలలో అత్యంత ప్రాధాన్యముంది. మొదటి రోజున గరుడపటాన్ని ధ్వజస్తంభంపై ఎగరవేసి ఉత్సవాలు ప్రారంభం కావడమే దీనికి నిదర్శనం. అలాగే ముల్లోకాల దేవతలు కూడా గరుడసేవలో స్వామిని దర్శించడానికి వస్తారని పురాణోక్తి. ఇక, మంగళవారం ఉదయం మోహినీ రూపం ధరించి మలయప్పస్వామి దంతపల్లకీలో తిరువీధుల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. తోడుగా శ్రీకృష్ణస్వామి మరో పల్లకీలో వేంచేస్తారు.



రాంభగీచ వద్ద ఏర్పాటు చేసిన క్యూలైన్

## పూర్తయిన ఏర్పాట్లు

గరుడసేవకు సోమవారం సాయంత్రానికే ఏర్పాట్లు పూర్తిచేశారు. గ్యాలరీల్లోకి ప్రవేశం, నిష్క్రమణ సమయాల్లో తోపులాటలు, తొక్కిసలాట లేకుండా పటిష్టమైన బ్యారికేడ్లు, క్యూలైన్లు సిద్ధం చేశారు. తిరుమలతో దాదాపు 25 ప్రదేశాల్లో 9 వేల వాహనాలకు సరిపడా పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. పార్కింగ్ స్థలాలు నిండిపోతే వాహనాలను తిరుపతిలోనే ఆపేస్తారు. తిరుపతిలో అదనపు పార్కింగ్ స్థలాలను సిద్ధం చేశారు. తిరుమల ఘాట్‌రోడ్లలో సోమవారం రాత్రి 9 నుంచి బుధవారం ఉదయం 6 గంటల వరకు ద్విచక్రవాహనాల అనుమతిని రద్దు చేశారు. మాడవీధుల్లో మొబైల్ క్లినిక్‌లు, 12 అంబులెన్స్‌లు, వైద్యులు, పారామెడికల్ సిబ్బందిని ఏర్పాటు చేశారు. గ్యాలరీల్లోకి రాలేని భక్తులు గరుడ సేవను తిలకించడానికి 28 భారీ హెచ్‌డీ డిజిటల్ స్క్రీన్లు ఉంచారు. దాదాపు ఏడు వేల మందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. 2,750 సీసీ కెమెరాలతో నిఘా పెట్టారు. గ్యాలరీల్లో దాదాపు 2 లక్షల మంది కూర్చునే అవకాశముంది. ఇన్నర్ రింగ్‌రోడ్డు, ఔటర్ రింగురోడ్డులో వేచిఉండే భక్తులను సుపథం, సౌత్ వెస్ట్ కార్నర్, గోవిందనిలయం నార్త్ వెస్ట్ కార్నర్, నార్త్ ఈస్ట్ గేట్ల ద్వారా అనుమతించి దర్శనం కల్పించనున్నారు.




### పెరిగిన రద్దీ

బ్రహ్మోత్సవాల్లో నాలుగు రోజుల నుంచి భక్తుల రద్దీ తక్కువగా ఉన్నప్పటికీ.. గరుడ సేవ నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం నుంచి భక్తుల రాక పెరిగింది. రాత్రి జరిగిన సర్వభూపాల వాహనసేవలో గ్యాలరీలు నిండుగా కనిపించాయి. గదులు దొరక్క భక్తులు కార్యాలయాలు, దుకాణాల ముందు, ఫుట్‌పాత్‌లు, చెట్ల కింద సేదతీరారు.

### చలిని లెక్క చేయక..

గరుడుడిపై గోవిందుడిని దర్శించుకోవాలన్న వారి కోరిక ముందు.. చలి కూడా చిన్నబోయింది. మంగళవారం సాయంత్రం జరిగే గరుడ సేవను వీక్షించడానికి సోమవారం రాత్రే భక్తులు గ్యాలరీల్లోకి చేరారు. చలిని లెక్కచేయకుండా గ్యాలరీలు, ఆలయం ముందు, అఖిలాండం వద్ద నిద్రించారు.



## అంకితభావంతో సేవలు అందించండి: ఈవో

గరుడసేవకు వచ్చే లక్షలాది మంది భక్తులకు అంకితభావంతో సేవలు అందించాలని టీటీడీ ఈవో శ్యామలరావు సూచించారు. గరుడసేవకు డిప్యుటేషన్‌పై నియమితులైన ఉద్యోగులతో సోమవారం సాయంత్రం తిరుమల ఆస్థానమండపంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 'నాలుగు మాడవీధుల్లోని 183 గ్యాలరీల్లో ప్రణాళికబద్ధంగా ఏర్పాట్లు చేశాం. గ్యాలరీల్లోని భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించేందుకు ఒక కో-ఆర్డినేటర్‌ను నియమించాం. మీరు పరిష్కరించలేని సమస్యలుంటే వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయండి. సమన్వయం, సమష్టి కృషి ముఖ్యం' అని పేర్కొన్నారు. అదనపు ఈవో వెంకయ్య చౌదరి మాట్లాడుతూ.. మెరుగైన సమన్వయంతో భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సేవలు అందించేందుకు మాడవీధుల్లో 563 మందిని నియమించామన్నారు. విధుల్లో 360 మంది సహాయక సిబ్బందినీ ఏర్పాటు చేశామన్నారు. జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# కాంట్రాక్టు కోసం వస్తే చంపేస్తాం!

**శ్రీకాళహస్తిలో సెక్యూరిటీ కాంట్రాక్టరుపై దౌర్జన్యం**

శ్రీకాళహస్తి, అక్టోబరు 7: 'ఎవడ్రా నువ్వు, ఎక్కడో సికింద్రాబాద్ నుంచి వచ్చి మా ఊర్లో టెండరు వేస్తావా? నీ అంతు చూస్తాం. మర్యాదగా పత్రాలు చేతికిచ్చి పారిపో. లేదంటే చంపేస్తాం' అంటూ ఓ సెక్యూరిటీ కాంట్రాక్టర్‌పై కొందరు కూటమి నేతలు దౌర్జన్యానికి పాల్పడిన ఘటన సోమవారం శ్రీకాళహస్తిలో జరిగింది. సికింద్రాబాద్‌కు చెందిన మయూరి సెక్యూరిటీస్ సర్వీసెస్ సంస్థ నిర్వాహకుడి కథనం మేరకు.. ఈ సంస్థ తరపున 2021-22లో ముక్కంటి ఆలయంలో సెక్యూరిటీ కాంట్రాక్టు నిర్వహించారు. ఈ ఏడాది జూలైలో ఆన్‌లైన్ ద్వారా మళ్లీ సెక్యూరిటీ టెండర్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు పత్రాలను నేరుగా సమర్పించే సమయంలో కొందరు ఇబ్బంది పెట్టడంతో ఇవ్వలేదు. దాంతో అప్పట్లో టెండర్ రద్దయింది. మళ్లీ గతనెల 20న ముక్కంటి ఆలయంలో సెక్యూరిటీ కాంట్రాక్టు కోసం అధికారులు ఆన్‌లైన్ ద్వారా టెండర్లను ఆహ్వానించారు. దరఖాస్తు చేసుకున్న కాంట్రాక్టర్లు సోమవారం సాయంత్రంలోగా ఆలయంలోని అధికారులకు ఒరిజినల్ పత్రాలను సమర్పించాలి. దీనికోసం మయూరి సెక్యూరిటీస్ సర్వీసెస్ సంస్థ నిర్వాహకుడు ఆలయం వద్దకు వచ్చారు. పరిపాలనభవనం వద్ద కాపుకాసిన నలుగురు కూటమి నేతలు అతడిని అడ్డుకున్నారు. ఆలయ ఓ సూపరింటెండెంట్ సమక్షంలోనే కాంట్రాక్టరు చేతిలోని సెల్‌ఫోన్ లాక్కుని దుర్భాషలాడారు. బ్యాగులో ఉన్న పత్రాలను గుంజుకునేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో తోపులాట జరిగింది. తాను దేశ రక్షణ కోసం 20 ఏళ్లపాటు ఆర్మీలో సేవలందించానని, గతంలో ఈ ఆలయంలో ఇదే కాంట్రాక్టును చిన్న మచ్చలేకుండా నిర్వహించానని ఆయన చెప్పారు. ఇలా పత్రాలు సమర్పించకుండా దౌర్జన్యానికి పాల్పడటం ఏమిటని కాంట్రాక్టరు ఆవేదన వ్యక్తంచేశారు. ఇలా బయటివారు టెండరు దాఖలు చేసేందుకు వీల్లేనప్పుడు ఆన్‌లైన్ ద్వారా ఎందుకు టెండర్ నోటీసులు ఎందుకు ఇచ్చారని ప్రశ్నించారు. కాగా, తన చేతిలోని సంచిని లాక్కునేందుకు తోపులాట జరగడంతో ఆలయంలోని పోలీస్‌అవుట్‌పోస్టు వద్ద రక్షణ కోసం వెళ్లి ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. అక్కడా పోలీసుల సమక్షంలోనే కూటమి నేతలు బూతులు తిట్టడంతో తాను భయాందోళనతో వచ్చేశాననని చెప్పారు. ఇదంతా సీసీ కెమెరాల్లోనూ నిక్షిప్తమైనట్లు సమాచారం.

# ఎకరాకు రూ.10లక్షలు ఇస్తేనే..!

**ప్రభుత్వ భూములిస్తామంటూ కొత్తపట్నం గ్రామసభలో రైతుల అల్టిమేటం**

కోట, అక్టోబరు 7: 'ఏళ్ల తరబడి ప్రభుత్వ భూములను సాగుచేసుకొని జీవిస్తున్నాం. ఇప్పుడు ఆ భూములను ఇవ్వాలంటే ఎకరాకు రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలి' అంటూ రైతులు తేల్చిచెప్పారు. చెన్నై, బెంగళూరు ఇండస్ట్రియల్ కోస్టల్ కారిడార్‌కు భూములు కోల్పోయే రైతులకు సోమవారం కోట మండలం కొత్తపట్నంలో అధికారులు గ్రామసభ నిర్వహించారు. ప్రస్తుతానికి ఈ పంచాయతీలో 310 ఎకరాలను గుర్తించామని, ఎకరాకు రూ.నాలుగు లక్షల పరిహారం ఇచ్చేలా ప్రయత్నిస్తామని, అది కూడా గట్టిగా చెప్పలేమని రెవెన్యూ అధికారులు తెలిపారు. దీంతో 2021లో కొత్తపట్నం పంచాయతీలో సెటిల్‌మెంట్ భూమి ఎకరాకు 21.75 లక్షలు ఇచ్చారని, ఇప్పుడు రూ.30 లక్షలు ఇస్తూ దానికి సమానంగా డీకేటీ భూమికి కూడా పరిహారం ఇవ్వాలని రైతులు కోరారు. అలాగే, ప్రభుత్వ భూములకు ఎకరాకూ రూ.4 లక్షలు కాకుండా రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండు చేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం మార్గం చూపుతానని గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీన రైతులకు సర్ది చెప్పారు. చిల్లకూరు మండలం తమ్మినపట్నంలో జరిగిన గ్రామసభలోనూ రైతులు.. తాము సాగుచేసుకుంటున్న ప్రభుత్వ భూములు వదలాలంటే రూ.10లక్షల పరిహారం చెల్లించాలన్నారు.

## ఒక్క రోజే 390 టెండర్లు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 7: జిల్లాలోని 227 మద్యం దుకాణాలకు సోమవారం ఒక్కరోజే దాదాపు 390 టెండర్లు దాఖలయ్యాయి. ఈ లెక్కన ఏడు రోజుల వ్యవధిలో మద్యం షాపులకు 600 టెండర్లు దాఖలు అయినట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వరరెడ్డి తెలిపారు. మరో రెండు రోజుల వ్యవధిలో కనీసం 20,000 దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.



## శ్రీవారికి అందిన చెన్నై గొడుగులు

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో గరుడసేవ రోజు మలయప్పకు అలంకరించేందుకు చెన్నై నుంచి హిందూ ధర్మార్థ సమితి తొమ్మిది గొడుగులు, రెండు పెరుమాళ్ నామాలను ఊరేగింపుగా సోమవారం తిరుమలకు తీసుకొచ్చారు. సమితి ట్రస్టీ ఆర్ఆర్ గోపాల్ ఆధ్వర్యంలో తిరుమలకు చేరుకున్న గొడుగులకు టీటీడీ అధికారులు స్వాగతం పలికారు. ఆలయం ముందు ఈగొడుగులను టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందించారు. నాలుగు మాడవీధుల్లో ఊరేగించాక ఆలయంలోకి గొడుగులు తీసుకెళ్లారు. గరుడసేవలో వీటిని అలంకరించనున్నారు.

## శ్రీవిల్లిపుత్తూరు మాలలు



శ్రీవారికి అలంకరించేందుకు తమిళనాడులోని శ్రీవిల్లిపుత్తూరు నుంచి గోదాదేవిమాలలు, చిలకలు సోమవారం తిరుమల చేరుకున్నాయి. బేడి ఆంజనేయస్వామి ఆలయం వద్దనున్న పెద్దజీయర్ మఠానికి మాలలను తీసుకొచ్చారు. పెద్ద జీయర్, చిన్నజీయర్ స్వాముల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడ్నుంచి టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, డిప్యూటీ ఈవో లోకనాథం, శ్రీవిల్లిపుత్తూరు ఆలయ స్థానాచార్యులు రంగరాజన్, సుదర్శన్ తదితరులు మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా గోదాదేవి మాలలను శ్రీవారి ఆలయంలోకి తీసుకెళ్లారు. కాగా, ఆండాళ్ మాలలు, శికామణి మాలల అని పిలిచే ఈ రెండు దండలు పెద్ద బుట్టలలో ఉంచి, తిరుపతికి 650 కిలోమీటర్ల దూరంలోని తమిళనాడులోని శ్రీవల్లిపుత్తూరుకు చెందిన రెండు కుటుంబాల పూల తయారీదారులు సమర్పిస్తున్నారు.

## భూదేవి అవతారం గోదాదేవి

శ్రీవిల్లిపుత్తూరులో గోదాదేవికి అలంకరించిన మాలలను గరుడసేవరోజు స్వామికి అలంకరించడం ఆనవాయితీ. శ్రీవిల్లిపూత్తురులోని శ్రీరంగమన్నార్‌స్వామి ఆలయానికి గోదాదేవి తండ్రి పెరియాళ్వార్ పుష్పకైంకర్యం చేసేవారని, రంగనాథుడిపై అనన్యభక్తి కలిగిన గోదాదేవి పూలమాలలను మొదట తాను ధరించి తర్వాత స్వామికి పంపేవారని పురాణోక్తి. ఈ విషయాన్ని గుర్తించిన పెరియాళ్వార్ తన కుమార్తెను మందలించారని, ఆ తర్వాత గోదాదేవి ధరించకుండా పంపిన మాలలను శ్రీరంగనాథుడు తిరస్కరించారని పురాణ కథనం. గోదాదేవి శ్రీవారి దేవేరి అయిన భూదేవి అవతారమని భావిస్తారు.

## నేత్రానందం.. స్నపనతిరుమంజనం

ఆలయంలోని రంగనాయకమండపంలో సోమవారం మధ్యాహ్నం స్నపన తిరుమంజనం నేత్రానందంగా జరిగింది. శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామిని ప్రత్యేక వేదికపై ఆశీనులను చేసి వివిధ రకాల సుగంధద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేశారు. రంగురంగుల ఆర్కిడ్ పుష్పాలతో వేదికను సుందరంగా తీర్చిదిద్దారు. ముందుగా విష్వక్సేరాధన, పుణ్యాహవచనం, ముఖ ప్రక్షాళన, ధూపదీప నైవేద్యం, ఛత్ర చామర వ్యజన దర్పణాది నైవేద్యం, రాజోపచారం నిర్వహించారు. అర్ఘ్యపాద నివేదనలో భాగంగా పాలు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, గంధంతో స్నపనం చేశారు. వీటిని శంఖనిధి, పద్మనిధి, సహస్రధార, కుంభధారణలతో వైఖానస ఆగమోక్తంగా స్నపనం నిర్వహించారు. కాగా, రోస్ పెటల్స్, స్ట్రాబెర్రీ, వట్టివేరు, అత్తి, కురువేరు, బ్లాక్ వెల్వెట్, ఏలకులు, లవంగ, పిస్తా, రెడ్ స్కిల్-రోస్ పెటల్స్‌తో తయారు చేసిన కిరీటాలు, మాలలను ఉత్సవమూర్తులకు సమర్పించారు.

– తిరుమల, ఆంధ్రజ్యోతి







మాట్లాడుతున్న ఎస్పీ సుబ్బారాయుడు

# గరుడోత్సవంలో సమర్థంగా విధులు నిర్వహించండి: ఎస్పీ

తిరుమల, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): గరుడోత్సవానికి బందోబస్తు అధికారులు, సిబ్బంది రెట్టింపు ఉత్సాహంతో విధులు నిర్వహించాలని ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశించారు. అనంతపురం రేంజ్ డీఐజీ షేముషి బాజ్‌పాయ్‌తో కలిసి సోమవారం సాయంత్రం పోలీసు ఉన్నతాధికారులతో ఆయన సమీక్షించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. నిత్యం అప్రమత్తంగా ఉంటూ తోపులాటలు, తొక్కిసలాటలు లేకుండా విధులు నిర్వహించాలన్నారు. గ్యాలరీల్లోకి ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లలో ప్రత్యేక జాగ్రత్తతో ఉండాలన్నారు. ట్రాఫిక్ సమస్య లేకుండా ముందస్తు ప్రణాళికలతో పనిచేయాలన్నారు. ఏదైనా పెద్ద సమస్యగా అనిపిస్తే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. పాతనేరస్థులపై నిఘా ఉంచడంతో పాటు అనుమానితులను అదుపులోకి తీసుకోవాలని, ఒకే ప్రదేశంలో ఎక్కువ సమయం ఉండే వస్తువులపైనా దృష్టి సారించాలని సూచించారు. రింగ్‌రోడ్డు నుంచి మాడవీధులకు అనుసంధానించి క్యూలైన్లపైనా ప్రత్యేక శ్రద్ధ వహించి భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. క్యూలైన్ల ఎంట్రీలో మెటల్ డిటెక్టర్లతో తనిఖీ చేసిన తర్వాతే అనుమతించాలన్నారు. రోప్ పార్టీలతో రద్దీని క్రమబద్ధీకరించాలన్నారు.



సోమవారం రాత్రి జరిగిన సర్వభూపాల వాహన సేవ సందర్భంగా గ్యాలరీల్లో భక్తజనం









# గరుడసేవ రద్దీకి అనుగుణంగా బస్సులు



అలిపిరి పాత చెక్‌పోస్టు వద్ద ద్విచక్ర వాహనాల పార్కింగ్

తిరుపతి(ఆర్టీసీ), అక్టోబరు 7: గరుడసేవ రోజున ఏర్పడే రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశారు. ఈ మేరకు అదనపు సిబ్బందితో పాటు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేశారు. కొండపైన పార్కింగ్ స్థలం కొరత, ట్రాఫిక్ అంతరాయం వంటి ఇబ్బందుల దృష్ట్యా టీటీడీ ద్విచక్రవాహనాలను పూర్తిగా, ప్రైవేటు కార్లను ఒక సమయం నుంచి ఆపేయాలని ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తిరుమలకు వెళ్లేవారిలో దాదాపుగా బస్సులోనే ప్రయాణించాలి కాబట్టి ఆర్టీసీ జిల్లా యంత్రాంగం అప్రమత్తమై తగు చర్యలు చేపట్టింది.

సీబీఎస్‌లోని ఏడుకొండలు, రైల్వేస్టేషన్, అలిపిరి బాలాజీబస్టాండులతో పాటు అదనంగా చెర్లోపల్లె మార్గంలో దేవలోక్, ఇస్కాన్ టెంపుల్, నెహ్రూమున్సిపల్, భారతీయ విద్యాభవన్, పద్మావతి మహిళా యూనివర్సిటీ మైదానాల పార్కింగ్ స్థలాల నుంచి బస్సులు తిరగనున్నాయి. ఛార్జీలలో ఎలాంటి మార్పు ఉండదు. ప్రతి పాయింట్ వద్ద రెండు బస్సులు ఉంటాయి. రద్దీకనుగుణంగా వెనువెంటనే బస్సులను రప్పించుకునే ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి ప్రతి బస్సులోనూ కండక్టరు అందుబాటులో ఉంటారు. గరుడసేవ ప్రారంభమైన కాసేపటికే భక్తులు తిరుగుముఖం పడతారు. అందుకని సాయంత్రం 6.30గంటలకు తిరుమల బాలాజీ, రాంభగీచ బస్టాండులలో 300 బస్సులు ఉంటాయి. మరో 50చొప్పున రెండు ఘాట్లలో తిరగనున్నాయి. ట్రాఫిక్ ఇబ్బందుల దృష్ట్యా కొండమీద నుంచి కిందికి దిగిన భక్తులను బస్టాండు, రైల్వేస్టేషన్, దేవలోక్, ఇతర ప్రాంతాలకు తరలించేందుకు అలిపిరి బాలాజీ బస్టాండు నుంచి 50బస్సులు ఉచితంగా రాకపోకలు సాగిస్తాయి. ఈ విధానం రద్దీ తగ్గుముఖం పట్టేంతవరకు కొనసాగుతుంది.

**హోల్డింగ్ పాయింట్స్ ఇలా ...**

తిరుమలలో పార్కింగ్ స్థలాల్లో కొరత ఏర్పడిన వెంటనే తిరుపతి శివారు ప్రాంతాలైన కరకంబాడి రోడ్డులోని ఎస్వీసీఈ, శ్రీకాళహస్తి మార్గంలో ఏర్పేడు, పుత్తూరు మార్గంలోని వడమాలపేట టోల్‌ప్లాజా, చిత్తూరుమార్గంలోని గాదంకి టోల్ ప్లాజా, రంగంపేట మార్గంలోని కె.ఎం.ఎం కాలేజీ వద్ద హోల్డింగ్ పాయింట్స్ ఏర్పాటు చేశారు. ఆర్టీసీ బస్సుల మినహా ఇతర వాహనాలను పైప్రాంతాలకే పరిమితం చేస్తారు. అక్కడ్నుంచి ప్రయాణికులను తిరుపతికి తరలించేందుకు సాధారణ ఛార్జీలతో ఆర్టీసీ బస్సులను విరివిగా నడిపే ఏర్పాటు చేశారు.

# కోనేటిరాయుడికి కళాభిషేకం

బ్రహ్మోత్సవాల్లో సోమవారం వాహనసేవల్లో కళాబృందాలు శ్రీవారికి కళాభిషేకం చేశాయి. ఉదయం కల్పవృక్షవాహనంలో 527 మంది ప్రదర్శనల్లో పాల్గొన్నారు. తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర సంగీత నృత్య కళాశాల విద్యార్థుల భరతనాట్యం, కూచిపూడి నృత్యాలు, గణేష్‌బృందం(హైదరాబాద్) కొమ్ము కోయ, గోండు నృత్యం ఆకట్టుకున్నాయి. అశోక్ బృందం,రాణి బృందం కేరళ డ్రమ్స్, బాబు బృందం(కడప) ప్రదర్శించిన డప్పుల విన్యాసాలు, దీప్తి బృందం(బెంగళూరు) కృష్ణామృత కల్పమ్ రూపకం, పీటీ చంద్రన్ బృందం(గురువాయూర్) తిరువట్టకాళి, రూప్‌సింగ్ బృందం(జార్ఖండ్) ఛండాలి నృత్య మంత్రముగ్ధులను చేసింది. విజయలక్ష్మి(గుంటూరు) ప్రదర్శించిన కాశ్మీరీ నృత్యం,సంధ్య బృందంతమిళనాడు) భరతనాట్యం, ఉత్తరాంధ్ర, తిరుపతి బృందాల కోలాట ప్రదర్శనలు కనువిందు చేశాయి.








# నేరాల నియంత్రణ దిశగా చర్యలు

తిరుమల, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తిరుమలలో నేరాల నియంత్రణ దిశగా పోలీసులు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశారు. పాపిలాన్ డివైజర్(ఫిన్స్)ను ఉపయోగించి దొంగల వేలిముద్రల ఆధారంగా వారిని గుర్తించి వారి నేర చరిత్రను కనిపెట్టడంతోపాటు ఎఫ్ఆర్ఎస్(ఫేషియల్ రికగ్నిజేషన్ సిస్టమ్) కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటి ఆధారంగా తిరుమలలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ ద్వారా దొంగలపై నిఘా ఉంచి వీడియో ఫుటేజీలను పరిశీలించి టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ద్వారా తక్షణమే నేరగాళ్లను పట్టుకునేలా చర్యలు చేపట్టారు. ఉచిత బస్సుల్లో యాత్రికులు ప్రయాణించే సమయంలో వారి ఆభరణాలను, నగదు, పర్సులను చోరీ చేసే అవకాశం లేకుండా ప్రతి బస్సులో పోలీసు సిబ్బందిని నియమించారు. తెలుగు, తమిళ్, కన్నడ, హిందీ, ఇంగ్లీషు భాషల్లో దొంగలు, దొంగతనాల గురించి వివరిస్తూ భక్తులను అప్రమత్తం చేసేలా కరపత్రాలను పంచి పెట్టడంతోపాటు టీటీడీ ప్రసార మాధ్యమాల ద్వారా భక్తులను నిరంతరం అప్రమత్తం చేస్తున్నారు. అదేవిధంగా పాత నేరస్థులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఈనెల 2 నుంచి 7వ తేదీ వరకు 80 మంది అనుమానితులను గుర్తించి అందులో 11 మంది దొంగలను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి నగదు, సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. అలాగే గరుడోత్సవం, రథోత్సవం, చక్రస్నానం సందర్భంగా దొంగతనాలను కట్టడి చేసే నిపుణులైన పోలీసు అధికారులను, సిబ్బందిని పిలిపించి భక్తుల రక్షణ దిశగా చర్యలు చేపట్టనున్నారు. కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల నుంచీ చోరీల నియంత్రణలో అరితేరిన అధికారులను పిలిపించి వారిని స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌లుగా ఏర్పాటు చేసి తిరుపతి, తిరుమలలోని ప్రధాన ప్రాంతాల్లో దొంగలను ముందుగానే గుర్తించి వారి ఆటకట్టించే దిశగా చర్యలు చేపడుతున్నారు. కాగా, దొంగలను గుర్తించిన వారు తిరుమల సీసీఎస్ సీఐ 9440796770, సీసీఎస్ పోలీస్ స్టేషన్ 0877-2289029, 0877-22634423 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.



## కళాబృందాలను పెంచితే మరింత కనువిందు

కల్పవృక్ష వాహన సేవలో కళాబృందాల ప్రదర్శనలపై సోమవారం టీటీడీ ఈవో శ్యామలరావు గ్యాలరీల్లోని భక్తుల వద్దకు వెళ్లి మాట్లాడారు. కొందరు కళారూపాలను మెచ్చుకున్నారు. ఆధ్యాత్మిక వైభవాన్ని పెంపొందించడానికి మరిన్ని కళలను చేర్చవచ్చన్నారు. వాహనం రాకుండా కళాబృందాలను భద్రతాసిబ్బంది ముందుకు పంపేస్తున్నారని కొందరు చెప్పారు.

## వాహన సేవలో జస్టిస్ వెంకటరమణ

మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ సోమవారం రాత్రి సర్వభూపాల వాహనసేవలో పాల్గొన్నారు. ఉత్సవమూర్తులను దర్శించుకున్నారు.



భక్తులతో మాట్లాడుతున్న ఈవో శ్యామలరావు



## బ్రహ్మోత్సవ వేళ.. మంచుతెరల మాల

తిరుమలలో సోమవారం ఉదయం కల్పవృక్ష వాహనసేవ పూర్తయిన తర్వాత చిరుజల్లులు పడ్డాయి. 20 నిమిషాల్లో చినుకులు ఆగిపోగా.. తిరుమల కొండను పొగమంచు కప్పేసింది. దీంతో శ్రీవారి వాహనసేవలను వీక్షించేందుకు వచ్చిన భక్తులు పొగమంచు అందాల్లోని తిరుమలను చూసి ఆనందపరవశులయ్యారు.

## ఆధ్యాత్మిక పుస్తకాల ఆవిష్కరణ

సోమవారం వాహన సేవల ముందు పలు ఆధ్యాత్మిక పుస్తకాలను ఆవిష్కరించారు. వీటిలో పి.కృష్ణమూర్తి విరచితం 'రాయలసీమలోని ప్రసిద్ధ దేవాలయాలు'.. వాసుదాసుస్వామి రచించిన 'వాసుదాసు కీర్తనలు'.. హరికేశవన్ 'భాగవత కథైగళిల్ భక్తియుం-ముక్తియం(తమిళం)'.. రవీంద్ర కుష్టగి రచించిన హరివంశ(మహాభారత ఖిలాభాగ-కన్నడ) పుస్తకాలున్నాయి. ఈవో, అదనపు ఈవో, జేఈవోలు, అన్నచార్య ప్రాజెక్ట్ సంచాలకుడు విభీషణ శర్మ తదితరులు పాల్గొన్నారు.



## 15 వేల మంది పిల్లలకు జియో ట్యాగ్‌లు

తిరుమలలో 22 చోట్ల పిల్లలకు పోలీసులు జియో ట్యాగ్‌లు వేస్తున్నారు. ఇప్పటి వరకు 15 వేల మందికి వేసినట్లు అధికారులు చెప్పారు. జియో ట్యాగ్ వేయించడం వల్ల పిల్లలు తప్పిపోతే వెంటనే గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించే అవకాశం ఉంటుందన్నారు. ఇలా జియో ట్యాగ్ చేయడంతో సోమవారం తప్పిపోయిన నవినాష్(4)ను.. ఆదివారం రాత్రి తప్పిపోయిన కత్తుల అఖిల లక్ష్మి(12)ని గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రతి చిన్నారికి తప్పక జియో ట్యాగ్ వేసేందుకు తల్లిదండ్రులు సహకరించాలని పోలీసులు తెలిపారు.



## వీనుల విందుగా భక్తి సంగీతం

తిరుమల, అక్టోబరు 7 : బ్రహ్మోత్సవాల్లో సోమవారం టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ధార్మిక, సంగీత కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. నాదనీరాజనం వేదికపై ఉదయం ఎస్వీ సంగీత నృత్య కళాశాలకు చెందిన రవిప్రభ, సుబ్రహ్మణ్యం, రామచంద్ర, చంద్రశేఖర్ బృందం ఆలపించిన మంగళధ్వని శ్రవణానందంగా సాగింది. తర్వాత చంద్రశేఖర పరమాచార్య యూనివర్సిటీ కులపతి వెంపటి కుటుంబ శాస్త్రి(కాంచీపురం) రుగ్వేదం-ఉదాత్త భావనలు అనే అంశంపై ఉపన్యసించారు. సాయంత్రం మోదుమూడి సుధాకర్ బృందం (విజయవాడ) అన్నమయ్య సంకీర్తనలను ఆలపించారు. ఆస్థాన మండపంలో ఉదయం సంపత్‌కుమార్ బృందం(హైదరాబాద్) విష్ణు సహస్రనామ పారాయణం, కె.సరస్వతి ప్రసాద్, కోనేరు లక్ష్మీ స్వరాజ్యంల బృందం(తిరుపతి) భక్తి సంగీతం, కె.భక్తవత్సలన్ ముదలాళ్వారుల ప్రబంధాలలో శ్రీవారు అనే అంశంపై ఉపన్యసించారు. బుల్లెమ్మ బృందం అన్నమాచార్య సంకీర్తనలను ఆలపించారు.

# తిరుపతి

## డీఆర్‌డీఏ పీడీ బాధ్యతల స్వీకరణ



తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు7: డీఆర్‌డీఏ పీడీగా టీఎన్ శోభన్‌బాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు జిల్లా నగరి క్లస్టర్ డ్వామా పీడీగా ఉన్న ఆయనను తిరుపతి జిల్లా డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. ముందుగా ఆయన కలెక్టర్ వెంకటేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి డీఆర్‌డీఏ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అందరి సహకారంతో జిల్లాలో మహిళా సంఘాల అభ్యున్నతికి, పేదరిక నిర్మూలనకు కృషి చేస్తానన్నారు.

## తిరుపతిలో వాన



తిరుపతి (లీలా మహల్), అక్టోబరు 7: తిరుపతిలో సోమవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో వర్షం జోరుగా కురిసింది. గంటపాటు కురిసిన వర్షానికి రోడ్లు, వీధులు జలమయమయ్యాయి. వాహనదారులు, వీధి వ్యాపారులు ఇబ్బంది పడ్డారు. వర్షానికి తోడు చలిగాలులు వీచడంతో పట్టణ ప్రజలు ఉక్కపోత నుంచి కాస్త ఉపశమనం పొందారు. లీలామహల్ సర్కిల్, కపిలతీర్థం, మున్సిపల్ ఆఫీసు, పట్టణంలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది.

## రవినాయుడికి మాజీ మంత్రి అభినందన



తిరుపతి(క్రీడలు), అక్టోబరు 7: శాప్ ఛైర్మన్ రవినాయుడిని మాజీ మంత్రి గల్లా అరుణకుమారి అభినందించారు. సోమవారం ఆయన చిత్తూరు జిల్లా తవణంపల్లె మండలం దిగువమాఘంలో అరుణకుమారిని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువకప్పి ఘనంగా సత్కరించారు. ఆమె రవినాయుడికి అభినందనలు తెలిపారు. పారిశ్రామికవేత్తలు, ఔత్సాహికులభాగస్వామ్యంతో క్రీడా రంగాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేలా చర్యలు చేపట్టామని రవినాయుడు ఆమెకు వివరించగా తమవంతు సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి మహేష్‌యాదవ్, తోటవాసు, రంజిత్‌నాయుడు, శ్రీరాంబాబీ తదితరులు పాల్గొన్నారు.

## కల్పవృక్ష వాహనంపై కల్యాణ వెంకన్న చిద్విలాసం



తిరుపతిరూరల్, అక్టోబరు 7: తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం శ్రీరాజమన్నార్ అలంకరణలో స్వామి వారు కల్పవృక్ష వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. రాత్రి సర్వభూపాల వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. పలు గ్రామాలకు చెందిన భక్తులు స్వామివారికి సారె సమర్పించి, మొక్కు చెల్లించుకున్నారు. వీరికి ఆలయ వ్యవస్థాపకుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఆయన కుమారులు మోహిత్‌రెడ్డి, హర్షిత్‌రెడ్డి స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. మంగళవారం రాత్రి గరుడ వాహన సేవకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు.

## ఎస్వీసీఈలో అంతరిక్ష వారోత్సవాలు



వారోత్సవాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతిరూరల్, అక్టోబరు 7: కరకంబాడి రోడ్డులోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల వేదికగా భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో), సతీష్ ధావన్ స్పేస్ సెంటర్(షార్) ఆధ్వర్యంలో అంతరిక్ష వారోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌తో కలిసి షార్ జనరల్ మేనేజర్ ఎన్ఎస్ఎన్‌మూర్తి, డిప్యూటీ డైరెక్టర్ పి.సునీల్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.సుధాకర్‌రెడ్డి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ మార్పులకనుగుణంగా కొత్త పరిశోధనలు రూపొందించాలని తెలిపారు. పి.సునీల్ మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించి ప్రోత్సహించేందుకు ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం విద్యార్థులకు వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించారు. కన్వీనర్ డాక్టర్ డి.శ్రీనివాసులురెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పార్టీకి వెన్నుపోటు పొడిచిన వారిని చేర్చుకోం

### టీడీపీ తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహ యాదవ్

తిరుపతి, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి) : గత ఎన్నికల ముందు వైసీపీలోకి వెళ్లిన తెలుగు మహిళ తిరుపతి పార్లమెంటు అధ్యక్షురాలు చక్రాల ఉష తాజాగా విజయవాడలో టీడీపీ యువనేత, మంత్రి నారా లోకేశ్, రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కలవడం దుమారం రేపింది. తిరిగి సొంత గూటికి వస్తున్నట్లు సంకేతాలిస్తూ ఆమె మీడియాతో పాటు సోషల్ మీడియాలోనూ లోకేశ్‌తో ఉన్న ఫొటోలు షేర్ చేశారు. ఇది శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి అనుచరులకు ఆగ్రహం తెప్పించింది. గుర్తింపునిచ్చిన పార్టీని వదిలి వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఎన్నికల సమయంలో వైసీపీ కండువా కప్పుకున్న ఉషను ఎట్టి పరిస్థితుల్లోనూ పార్టీలోకి తీసుకోవద్దని మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ పరిణామాలను నరసింహ యాదవ్ సోమవారం రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు ఫోనులో వివరించినట్లు తెలిసింది. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఎన్నికల ముందు వైసీపీలో చేరిన ఎవ్వరినీ చేర్చుకోబోమని ఆంధ్రజ్యోతికి చెప్పారు.

## అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



తిరుపతి(కల్చరల్), అక్టోబర్ 7: తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మహతి వేదికలో సోమవారం సాయంత్రం హైదరాబాదుకు చెందిన ఎం.గౌరవి రెడ్డి బృందం ప్రదర్శించిన నృత్యం ప్రేక్షకులను అలరించింది. అన్నమయ్య కీర్తనలకు నాట్యనీరాజనం అర్పించారు. అలాగే రామచంద్ర పుష్కరిణి వేదికపై హైదరాబాదుకు చెందిన అమృతవల్లి, గీతావాణి బృందం నిర్వహించిన భక్తిసంగీత కార్యక్రమం ఆహూతులను అలరించింది. టీటీడీ దాససాహిత్య ప్రాజక్టు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సప్తగిరి పత్రిక ఉప సంపాదకులు డాక్టర్ అల్లాడి సంధ్య పాల్గొన్నారు.

## సిద్ధార్థలో ఘనంగా ఫ్రెషర్స్‌డే



తిరుపతి రూరల్, అక్టోబరు7: తిరుపతి రూరల్ మండలం సి.గొల్లపల్లెలోని సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రథమ సంవత్సర (సివిల్, మెకానికల్, ట్రిపుల్‌ఈ) విద్యార్థులకు ఫ్రెషర్స్ డే సోమవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల సెక్రటరీ వై.ఆనందరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఉద్యోగ, ఉపాధికి అవసరమైన నైపుణ్యాలను పెంచుకోవాలని తెలిపారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఛైర్మన్ వై.కొండారెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ వై.విజయ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రాజశేఖర్, హెడ్లు, పాల్గొన్నారు.

## టాస్క్‌ఫోర్సు డీఎస్పీ బాధ్యతల స్వీకరణ

మంగళం, అక్టోబరు 7: టాస్క్‌ఫోర్సు డీఎస్పీగా జి.బాలిరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన టాస్క్‌ఫోర్సు ఇన్‌చార్జి, ఎస్పీ సుబ్బరాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్‌తో సమావేశమయ్యారు. ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టేందుకు కృషి చేస్తానని డీఎస్పీ తెలిపారు.

## ముగిసిన వన్యప్రాణి వారోత్సవాలు



బహుమతులు అందజేస్తున్న యశోదబాయ్, రమణ

మంగళం, అక్టోబరు 7: ఎస్వీ జూపార్కులో వారం రోజులుగా నిర్వహిస్తున్న వన్యప్రాణి వారోత్సవాలు సోమవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు యశోదబాయ్, ఏపీ టూరిజం డైరెక్టర్ రమణ ముఖ్య అతిథులుగా హాజరై వన్యప్రాణుల సంరక్షణ, ప్రకృతి, అడవులు, మానవుల అనుసంధానం గురించి విద్యార్థులకు వివరించారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. జూపార్కుపై చిత్రీకరించిన వీడియోను ప్రారంభించారు.

## కార్గోలో నిల్వ వస్తువులకు 17న వేలం

తిరుపతి(ఆర్టీసీ), అక్టోబరు 7: ఆర్టీసీ కార్గో కేంద్రాల్లో వినియోగదారులు తీసుకోని 35 వస్తువులకు ఈనెల 17న బహిరంగ వేలం వేయనున్నట్లు ఏటీఎం డి.రామచంద్రనాయుడు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తిరుపతి సెంట్రల్ బస్టాండులోని కార్గో పాయింట్‌లో ఉదయం 11 గంటలకు జరిగే వేలంలో ఆసక్తి గలవారు పాల్గొనాలని కోరారు. పాడినవారు అప్పటికప్పుడు నగదు చెల్లించి, వస్తువులు తీసుకోవచ్చునని, తిరిగి తీసుకునేది లేదని తెలిపారు. మరిన్ని వివరాలకు 9553855667, 8712220770లను సంప్రదించాలని కోరారు.

## లలితా త్రిపురసుందరిగా గంగమ్మ



తిరుపతి(కల్చరల్), అక్టోబర్ 7: తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సోమవారం అమ్మవారు లలితాత్రిపుర సుందరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, సహస్రనామార్చన నిర్వహించారు. సాయంత్రం లలితాత్రిపురసుందరిదేవి అలంకారంలో ఊంజల సేవ నిర్వహించారు. భక్తులకు, ఉభయదారులకు అమ్మవారి ప్రసాదాలు అందజేశారు. ఈవో జయకుమార్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

**కపిల తీర్థంలో..**

కపిల తీర్థం ఆలయంలో సోమవారం ఉదయం యాగశాల పూజ, స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి మామిడిసేవ అలంకరణలో ఊంజలసేవ నిర్వహించారు. మంగళవారం కామాక్షి అమ్మవారు అన్నపూర్ణాదేవి రూపంలో భక్తులను అనుగ్రహిస్తారు.

### మామిడి సేవ అలంకరణలో బొంతాలమ్మ



తిరుపతి (జీవకోన), అక్టోబరు 7: కరకంబాడి రోడ్డులోని బొంతాలమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారు మామిడి సేవ(పార్వతి పరమేశ్వరుని) అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

### మహేశ్వరీదేవిగా...



తిరుపతి అర్బన్, అక్టోబరు 7: దేవీనవరాత్రి ఉత్సవాలలో భాగంగా లక్ష్మీపురం కూడలిలోని అన్నపూర్ణదేవి సమేత కాశీవిశ్వనాథస్వామి ఆలయంలో సోమవారం రాత్రి అమ్మవారు మహేశ్వరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం, సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నివేదన కావించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. సోమవారం కావడంతో రాత్రివేళ ఆలయంలో భక్తుల రద్దీ వాతావరణం సంతరించుకుంది.

### మహేశ్వరీదేవిగా చాముండేశ్వరి



తిరుపతిరూరల్, అక్టోబరు 7: తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటక్రాస్ ఎల్ఎస్‌నగర్‌లోని శ్రీశక్తిచాముండేశ్వరీదేవి ఆలయంలో సోమవారం అమ్మవారు మహేశ్వరీదేవి అలంకరణలో భక్తులను అనుగ్రహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభి షేకం, అలంకారం, హోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఆలయ ధర్మకర్త బిరుదాల భాస్కర్‌రెడ్డి, ఉభయదారులు బి.మంజుల, బి.బాలాజి, సీహెచ్ గీత, సాగర్, ఆనంద్, వర్దన్, విశాల్, శాంతి పాల్గొన్నారు.

## పీజీఆర్ఎస్‌కు 200 వినతులు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 7: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదిక (పీజీఆర్ఎస్)కు 200 వినతులు అందాయి. అందులో భూ సమస్యలపై 136 ఉన్నాయి. జేసీ శుభం బన్సల్, డీఆర్వో పెంచల కిషోర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవేంద్రరెడ్డి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్జీలను గడువులోగా పరిష్కరించాలని జేసీ జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు.

**5వ తేదీలోపు జీతాలు చెల్లించండి**

సివిల్ సప్లైస్ హమాలీ కార్మికులకు ప్రతినెలా 5వ తేదీలోపు జీతాలు చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి కోరారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. కార్మికులకు పీఎఫ్ కొత్త కార్డులు ఇవ్వాలని, గోదాము వద్ద విశ్రాంతి గది ఏర్పాటు చేయాలని, పెరిగిన ధరలకనుగుణంగా కూలి పెంచాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, రవి, శ్రీరాములు, శివ, మహేంద్ర, ప్రమీల, కామాక్షి, శ్రీనివాసులు, అయ్యప్ప, చెంచయ్య పాల్గొన్నారు.

**మా భూములు అప్పగించండి**





కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న సివిల్‌సప్లైస్ కార్మికులు, కేవీబీపురం వాసులు

కేవీబీపురం సర్వే నెంబరు 212, 213లలోని ప్రభుత్వ భూమి కొన్నేళ్లుగా తమ అనుభవంలో ఉందని, దాన్ని కొందరు కబ్జా చేయాలని చూస్తున్నారని, న్యాయం చేయాలని దళితులు, గిరిజనులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. వారికి మద్దతు తెలిపిన సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి మాట్లాడుతూ గిరిజనులకు వారి అనుభవంలోని భూమిని 5 సెంట్లు చొప్పున పంపిణీ చేయాలన్నారు. భూములను ఇతరులకు కట్టబెట్టేందుకు సహకరించిన తహసీల్దారు శ్రీదేవి, సర్వేయర్ మురళిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**ఎస్టీల భూమిని కాపాడండి**

ఏర్పేడు మండలం మునలిపేడు గ్రామంలో ఎస్టీలకు చెందిన 8 ఎకరాల భూమిని గత ప్రభుత్వంలో అధికారులను అడ్డం పెట్టుకుని రికార్డులు తారుమారు చేసి కబ్జా చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. భూ కబ్జాదారుల నుంచి ఎస్టీలకు రక్షణ కల్పించడమేగాక వారి భూములను తిరిగి ఇప్పించాలని కోరారు.

## ఆరు జీపుల సీజ్

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 7: భక్తుల నుంచి అదనపు చార్జీలు వసూలు చేసిన ఆరు జీపులను పోలీసులు సీజ్ చేశారు. బ్రహ్మోత్సవాల్లో తిరుపతి నుంచి తిరుమలకు రూ.100మాత్రమే వసూలు చేయాలని, అదనంగా తీసుకోవద్దని కొన్ని రోజులుగా అధికారులు ప్రచారం చేశారు. ఈ మేరకు వాహనాలకు స్టిక్కర్లు కూడా అతికించారు. సోమవారం అలిపిరి సీఐ రాంకిషోర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు అలిపిరి, గరుడ, నంది విగ్రహం, అలిపిరి లింక్ బస్టాండ్‌ల వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. భక్తుల నుంచి రూ.150 చొప్పున వసూలు చేసిన జీపులను సీజ్ చేశారు.

## జేటీసీకి సన్మానం



తిరుపతి (జీవకోన), అక్టోబరు 7: తిరుపతి జోన్ రవాణా శాఖ జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన కృష్ణవేణిని రాష్ట్ర రవాణా శాఖ సభ్యుడు ఎం.సునీల్ చక్రవర్తి సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఆమె గుంటూరు నుంచి బదిలీపై తిరుపతి జోన్‌కు వచ్చారు.

## నిబంధనల అతిక్రమణపై కేసు నమోదు

తిరుపతి(కపిలతీర్థం), అక్టోబరు 7 : నిబంధనలు అతిక్రమించి తిరుగుతున్న మూడు టెంపోలు, మూడు జీపుల నిర్వాహకులపై అధికారులు కేసు నమోదు చేశారు. జిల్లా రవాణాశాఖాధికారి మురళీమోహన్ ఆధ్వర్యంలో సోమవారం తిరుమలలో వాహనాల తనిఖీ చేపట్టారు. సరైన ధృవపత్రాలు లేని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించిన వాహనాలను గుర్తించి, కేసు నమోదు చేసి, అలిపిరి పోలీసు స్టేషన్‌కు తరలించారు. తనిఖీల్లో రవాణా శాఖ అధికారులు ప్రసాద్ వర్మ, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

## హేతుబద్ధంగా భూసర్వే

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 7 : పొరపాట్లకు తావులేకుండా హేతుబద్ధంగా భూసర్వే నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ నుంచి భూసమస్యలు, భూసర్వేకు సంబంధించి అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో వచ్చే భూ సమస్యల అర్జీలు రీ ఓపెన్ కాకుండా పరిష్కారం చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆర్డీవోలు, తహసీల్దార్లు, మండల సర్వేయర్లు, వీఆర్వోలను ఆదేశించారు. తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జేసీ శుభం బన్సల్, డీఆర్వో పెంచలకిషోర్, ఆర్డీవోలు, ల్యాండ్ అండ్ భూ రికార్డుల ఏడీ పాల్గొన్నారు.

**దళితవాడల్లో మౌలిక సదుపాయాలు**

జిల్లాలోని ఎస్సీ కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా 100 రోజుల కార్యాచరణలో భాగంగా సీసీ రోడ్లు, డ్రైనేజీ, సురక్షిత తాగునీరు, గృహాలు, రోడ్ల కనెక్టివిటీపై దృష్టి సారించాలని సూచించారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి చెన్నయ్య పాల్గొన్నారు.

## బంజారాలకు గుర్తింపు అభినందనీయం

తిరుపతి (లీలామహల్), అక్టోబరు7: బంజారాలకు గుర్తింపు ఇచ్చేలా మహారాష్ట్రలో నంగార భవన్ (బంజారాల చారిత్రక మ్యూజియం) నిర్మించడం అభినందనీయమని ఆలిండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు శివనాయక్ పేర్కొన్నారు. ఇందుకు కృషి చేసిన పీఎం మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం ఆయన ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ ... ఆశయాలకనుగుణంగా రూ.900 కోట్లతో నిర్మించిన మ్యూజియం బంజారాల ఉనికిని తెలియజేస్తుందన్నారు. హథీరాంజీ బాబా మందిర నిర్మాణానికి విన్నవించినట్లు చెప్పారు. సంఘం నేతలు లలిత, కిషోర్‌నాయక్, నాగార్జున, వెంకటేష్ పాల్గొన్నారు.

## టీడీపీతోనే బ్రాహ్మణుల అభ్యున్నతి

తిరుపతి (లీలామహల్), అక్టోబరు 7 : టీడీపీ ప్రభుత్వంలోనే బ్రాహ్మణుల అభ్యున్నతి సాధ్యపడుతుందని బ్రాహ్మణ సాధికారిక సమితి రాష్ట్ర కన్వీనర్ బుజ్జి రామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన వంద రోజుల్లోనే బ్రాహ్మణుల సంక్షేమం కోసం రూ.250 కోట్ల రుణాలు అందించారని కొనియాడారు. ఆలయాల్లో దీపధూప నైవేద్యాలకు రూ.10 వేలు ఉన్న నిధిని రూ.15వేలు చేశారని తెలిపారు. బ్రాహ్మణ కార్పొరేషన్ క్రెడిట్ సొసైటీ ఏర్పాటు చేస్తామన్నారు.

## ఎన్ఎంఎంఎస్ దరఖాస్తు గడువు 15 వరకు పొడిగింపు

తిరుపతి(విద్య), అక్టోబరు 7: జాతీయ స్థాయిలో నిర్వహించే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్) పరీక్షా దరఖాస్తు గడువును ఈనెల 15వ తేదీ వరకు పొడిగించారని ప్రభుత్వ పరీక్షల విభాగం జిల్లా అసిస్టెంట్ కమిషనర్ గురుస్వామిరెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, ప్రభుత్వ ఎయిడెడ్ ఉన్నత, ప్రాథమికోన్నత, ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదివే విద్యార్థులు అర్హులని తెలిపారు. తల్లిదండ్రుల వార్షికా దాయం రూ.3.50లక్షల లోపు ఉండాలని, ఓసీ, బీసీ విద్యార్థులు పరీక్ష ఫీజు కింద రూ.100, ఎస్సీ ఎస్టీలు రూ.50 చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. ఆన్‌లైన్ అప్లికేషన్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్‌లో ఉందని తెలిపారు. ప్రింటెడ్ నామినల్ రోల్, ఎస్బీఐ ఫీజు చెల్లింపు రసీదులను ఈనెల 17వ తేదీలోపు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు డీఈవో కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

## జాతీయ తైక్వాండో పోటీలకు ఎంపిక

తిరుపతి(క్రీడలు), అక్టోబరు 7: జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు క్రీడాకారుల ఎంపిక పూర్తయింది. 68వ ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి తైక్వాండో అండర్ 14, 17 బాలబాలికల పోటీలు శ్రీనివాస క్రీడా సముదాయంలో రెండు రోజుల పాటు జరిగాయి. ప్రథమస్థానం కైవసం చేసుకున్న వారికి బంగారు పతకం, ప్రశంసాపత్రాలు అందజేశారు. అండర్ -14 విభాగంలో ఓవరాల్ ఛాంపియన్‌గా కడప బాలికలు, అండర్-17విభాగంలో ఓవరాల్ ఛాంపియన్‌గా విశాఖపట్నం బాలికలు నిలిచారు. వీరు వచ్చేనెల రెండో వారంలో మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ప్రాతినిథ్యం వహిస్తారు. చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాలర్ దివాకర్‌రెడ్డి ట్రోఫీలను ప్రదానం చేశారు. రాష్ట్ర స్కూల్ గేమ్స్ కార్యదర్శి భానుమూర్తిరాజు, జిల్లా కార్యదర్శి ఎస్.బాబు, డీఎస్‌డీవో సయ్యద్‌సాహెబ్, టోర్నీ అబ్జర్వర్ విశ్వనాథ్ పాల్గొన్నారు.

**బంగారుపతకం సాధించిన వారు..**

- అండర్ 14 బాలురు : టి.బద్రికుమార్, పి.సాయితనుష్ (చిత్తూరు), ఎం.తిలక్‌రోషన్(శ్రీకాకుళం), సి.సందీప్‌గౌడ్, శౌర్యరెడ్డి(కర్నూలు), ఎస్.ఇబ్రహీం, ఎన్.నాగసాత్విక్(కడప), ఎ.వెంకటధనుష్(విశాఖపట్నం), ఎస్.శ్యామ్‌సుందర్(విజయనగరం), కె.దినకర్(తూ.గో)
- అండర్ 17 బాలురు : నివేద్‌కుమార్(పుత్తూరు), ఎం.విష్ణు, వి.చరణ్(కడప), పి.మణికంఠహిమాన్షు, ఎన్.మోహిత్(వైజాగ్), వి.హరిచరణ్‌తేజ్, సి.గౌతంకృష్ణారెడ్డి(అనంతపురం), బి.హర్షవర్ధన్, ఎన్.భగవాన్(తూర్పుగోదావరి), టి.ఢిల్లీశ్వరరావు, రేవంత్‌రెడ్డి(శ్రీకాకుళం)
- అండర్ 14 బాలికలు : బి.భాగ్యప్రియ, ఎ.సోనియా(కర్నూలు), జి.ఏక్తప్రియ(కృష్ణ), కె.సృజన, కె.దర్శన(అనంతపురం), జె.పూజిత, కె.త్రివేణి, పి.హర్షిత(కడప), ఎం.తపస్వి(శ్రీకాకుళం), వై.జ్యోష్న(విశాఖపట్నం)
- అండర్ 17 బాలికలు : ఆర్.చందన, సి.అమృత(చిత్తూరు), టి.నిఖిలశ్రీ, ఎ.దీక్షశ్రీ(విజయనగరం), వై.లాస్య, ఎస్.కె.సార(కడప), పి.పూజిత, యోగచార్విత(అనంతపురం), బి.వేదశ్రీ(శ్రీకాకుళం), పి.జాష్విక, పి.సుష్మిత, అంజనప్రియ(వైజాగ్), పి.హేమశ్రీనిధి(తూ.గో.)

## పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

తిరుపతి,(ఆటోనగర్) అక్టోబరు 7: పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులతో ప్రపంచ శాంతికి ముప్పు వాటిల్లే ప్రమాదముందని, ప్రపంచ దేశాలు స్పందించి యుద్ధం నిలుపుదల చేయాలని ఐఎఫ్‌టీయూ తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.హరికృష్ణ విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆర్టీసీ బస్టాండు వద్దనున్న అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. యూనియన్ నేతలు పి.వెంకటరత్నం, కె.వెంకటరత్నం, రాణి, శాంతి, రుద్రగోపి, లోకేష్ పాల్గొన్నారు. ● గాజా నగరంపై ఇజ్రాయిల్ జరుపుతున్న దాడులను వెంటనే ఆపాలని పలు రాజకీయ పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. ఇజ్రాయిల్ దాడులకు నిరసనగా యశోదనగర్‌లోని వేమన భవన్‌లో సదస్సు నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు, సీపీఐ నాయకులు సి.పెంచలయ్య, ఐఎఫ్‌టీయూ నాయకులు సత్తార్, కాంగ్రెస్ నాయకులు గోపి మాట్లాడారు. నాయకులు జయచంద్ర, సాయిలక్ష్మి, ఆర్.లక్ష్మి, విశ్వనాథం, చలపతి పాల్గొని ప్రసంగించారు.

## మండల సర్వేయరు బాధ్యతల స్వీకరణ

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 7: మండల సర్వేయర్‌గా రాజ్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న సర్వేయరు మునస్వామి అనారోగ్యంతో సెలవుపై ఉన్నారు. దీంతో నెల్లూరు సిటీలో పని చేస్తున్న రాజ్‌కుమార్ బదిలీపై వచ్చారు.

## బీఎన్‌కండ్రిగలో భారీ వర్షం



బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 7: మండలంలో సోమవారం భారీ వర్షం కురిసింది. దీంతో మండల ప్రజలు ఎండవేడిమి నుంచి ఉపశమనం పొందారు. రెండు నెలలుగా వర్షం కురవకపోవడంతో మండల రైతాంగం నిరాశలో ఉంది ప్రస్తుతం కురిసిన వర్షం వల్ల దుక్కులు దున్నడానికి రైతులు సిద్ధపడుతున్నారు.

# పుత్తూరు వార్తలు

## పద్మశాలి వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య బాధ్యతల స్వీకరణ



పుత్తూరు అర్బన్, అక్టోబర్ 07: రాష్ట్ర పద్మశాలి వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా గంజి మాధవయ్య బాధ్యతల స్వీకరణ అట్టహాసంగా సాగింది. సోమవారం విజయవాడలోని బీసీ కార్పొరేషన్ కార్యాలయంలో రాష్ట్ర బీసీ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ తనూజారాణి నేతృత్వంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాధవయ్యకు పలువురు అభినందనలు తెలియజేశారు. తనకు కార్పొరేషన్ డైరెక్టర్ పదవి వచ్చేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే భానుప్రకాష్‌కు మాధవయ్య కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు కార్పొరేషన్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన అబద్దయ్యను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## మెరుగైన పారిశుధ్యమే లక్ష్యం

పుత్తూరు అర్బన్, అక్టోబరు 7: మున్సిపల్ పరిధిలో మెరుగైన పారిశుధ్యమే లక్ష్యంగా పనిచేయాలని కమిషనర్ మంజునాథ్ గౌడ్ శానిటరీ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం పారిశుధ్య నిర్వహణ, చెత్త సేకరణ ప్రకియలను కమిషనర్ తనిఖీ చేశారు. 13 సచివాలయాల పరిధిలో 13 ఈ-ఆటోల ద్వారా చెత్త సేకరణ నిరంతరాయంగా కొనసాగాలని శానిటరీ సూపర్‌వైజర్ శ్రీనివాస్‌ను ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధిలో 20 టన్నుల చెత్త సేకరిస్తున్నట్టు అధికారులు తెలిపారు.

## పిడుగు పడి మహిళ మృతి



నాగరత్నమ్మ మృతదేహం

వడమాలపేట, అక్టోబర్ 7: మండలంలోని సీతారామపురం పంచాయితీ మేదరమిట్టకు చెందిన మహిళ సోమవారం పిడుగుపాటుకు మృతి చెందింది. నాగరత్నమ్మ(58) సమీపంలోని గుట్ట వద్ద మేకలు మేపుతుండగా భారీ వర్షం పడడంతో చెట్టు కింద బండపై కూర్చుంది. ఇంతలో పక్కనే పిడుగు పడి అక్కడిక్కడే మృతి చెందింది.

## అన్నపూర్ణగా ద్రౌపది దేవి కటాక్షం





అన్నపూర్ణదేవి అలంకరణలో ద్రౌపది, బాల త్రిపుర సుందరిగా వాసమాంబ

పుత్తూరు టౌన్/ వడమాల పేట, అక్టోబర్ 7: పుత్తూరు పట్టణంలోని ద్రౌపదిదేవి సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణదేవిగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉత్సవ కమిటీ ఛైర్మన్ కిష్టప్ప మొదలి, సభ్యులు పాల్గొన్నారు. నాగాలమ్మ ఆలయంలో అమ్మవారు లలితా త్రిపుర సుందరి దేవిగా భక్తులను కటాక్షించారు. రాచపాలెంలోని లక్ష్మీ కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని లలితా త్రిపుర సుందరి దేవిగా అలంకరించి గ్రామంలో ఊరేగించారు. వడమాలపేట పట్టణంలోని కన్యాకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు బాల త్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు.



# శ్రీకాళహస్తి సత్యవేడు

# కటాక్షించు మాతా

















మీనాక్షిదేవి అలంకారంలో పొన్నాలమ్మ, బీపీఅగ్రహారం పెద్దగంగమ్మ - స్కందమాతగా బొమ్మలకొలువులోని జ్ఞానప్రసూనాంబ - లలితాదేవి అలంకారంలో కనకదుర్గమ్మ - భువనేశ్వరి దేవిగా కనకాచలం కనకదుర్గమ్మ - మొక్కజొన్న కంకులతో ముత్యాలమ్మ - శివకామిసుందరి అలంకారంలో బహదూరుపేట కన్యకాపరమేశ్వరి

శ్రీకాళహస్తి, అక్టోబరు 7: కటాక్షించవమ్మ మాతా అంటూ భక్తులు అమ్మవార్లకు మొక్కారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదోరోజు అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులపై వరాల జల్లు కురిపించారు. భక్తులు ఉదయంనుంచే ఆలయాలకు వెళ్లి దీపారాధనలు చేపట్టారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో జ్ఞానప్రసూనాంబిక ఉత్సవమూర్తి అశ్వాసురవధ అలంకారంలో దర్శనమిచ్చారు. సాయంత్రం అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి రంగులగోపురం వరకు ఊరేగించారు. అలాగే ఆలయంలోని ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు ఉత్సవమూర్తి స్కందమాతగా కొలువుదీరారు. ఆలయంలోని కనకదుర్గమ్మ లలితాదేవిగా, ఆలయానికి అనుబంధంగా కనకాచలంపై కొలువైన కనక దుర్గమ్మను ప్రత్యేకంగా అలంకరించారు. బజారువీధిలోని కన్యకాపరమేశ్వరి ఉత్సవమూర్తి అశ్వరూఢాదేవిగా, మొక్కజొన్నల అలంకారంలో ముత్యాలమ్మ, మహాలక్ష్మి అలంకారంలో భాస్కరపేట చాముండేశ్వరి, తెట్టు కూడలిలోని నల్లగంగమ్మ మహాలక్ష్మి అలంకారంలో భక్తులను కటాక్షించారు. సంతమైదానం అంకాళమ్మ, ముత్యాలమ్మ గుడివీధిలోని ముత్యాలమ్మ, బహదూరుపేటలోని కన్యకాపరమేశ్వరిని శివకామి సుందరిగా అలంకరించారు. తెట్టు విశ్వ బ్రాహ్మణ వీధిలోని గంగమ్మ, ముత్యాలమ్మ గుడివీధిలోని నింబజాదేవి, అష్టలక్ష్మి, బీపీఅగ్రహారం గంగమ్మ, పొన్నాలమ్మ, పూసల వీధిగంగమ్మ,శీతాలాంబ, త్రిశూలాంబ, సంత మైదానం అంకాళమ్మ, పీవీ రోడ్డులోని అంకమ్మ, వేడాం దక్షిణ కాళికాదేవి, బంగారమ్మ, పానగల్ గంగమ్మ ప్రత్యేకఅలంకారంలో దర్శనమిచ్చారు.

## గుడిమల్లంలో నిత్య కుంకుమార్చన

ఏర్పేడు, అక్టోబరు 7: మండలంలోని గుడిమల్లంలో వెలసిన పరశురామేశ్వరస్వామి ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజు కుంకుమార్చన నిర్వహిస్తున్నారు. ఆలయ మాజీ ఛైర్మన్ గిరినాయుడు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గుడిమల్లంలో వెలసిన పరశురామేశ్వరస్వామి ఆలయంలో శ్రీవల్లీ, దేవసేన అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సిద్దేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త గిరిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. చిందేపల్లిలోని సిద్దేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పార్వతిదేవి లలిత త్రిపుర సుందరిగా భక్తులను కటాక్షించారు.

**వరదయ్యపాళెం:** మండలంలోని అంబూరులో కొలువై ఉన్న కామాక్షమ్మ ఆలయంలో అమ్మవారు మహాచండిదేవిగా భక్తులకు దర్శమిచ్చారు. అమ్మవారికి ప్రత్యేకపూజలు చేశారు. ఆణిముత్యం నందకిషోర్‌రెడ్డి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

**నారాయణవనం:** మండలంలోని సముదాయంలో టీటీడీ అనుబంధ ఆలయమైన అవనాక్షమ్మ ఆలయంలో అమ్మవారిని సాయంత్రం 6.30 గంటలకు కామాక్షిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.



నిత్య కుంకుమార్చన

## సర్వే చేసి హద్దులు చూపండి

శ్రీకాలహస్తి, అక్టోబరు 7: మండలంలోని రామాపురంలో దళితులకు ఇచ్చిన భూములను సర్వే చేసి హద్దులు చూపించాలని బీకేఎంయూ నియోజకవర్గ కార్యదర్శి శివకుమార్ కోరారు. ఈ మేరకు ఆర్డీవో కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. అమ్మపాళెం, పుల్లారెడ్డి కండ్రిగ, తొండమనాడు, ఎగువవీధుల్లో 1991 నుంచి సుమారు 120 ఎకరాల్లో దళితులు వర్షాధార పంటలు వేసుకుని జీవిస్తున్నారన్నారు. సర్వే చేసి హద్దులు చూపించాలని లేకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. మణి, శ్రీనివాసులు, దశరధయ్య తదితరులు పాల్గొన్నారు.

## తీరు మారకుంటే వైసీపీ గతే

శ్రీకాళహస్తి, అక్టోబరు 7: ప్రభుత్వ తీరు మారకుంటే వైసీపీకి పట్టిన గతే కూటమికి పడుతుందని సీఐటీయూ నాయకులన్నారు. చిరుద్యోగులపై రాజకీయ వేధింపులకు వ్యతిరేకంగా తొట్టంబేడు వెలుగు కార్యాలయం వద్ద బాధిత సంఘమిత్రలతో కలిసి సీఐటీయూ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఏ.పుల్లయ్య, కార్యదర్శి పి.గురవయ్య మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను విస్మరించిందన్నారు. కూటమిలోని రాజకీయ నిరుద్యోగులకు లబ్ధి చేకూర్చేందుకు స్కీం వర్కర్లే లక్ష్యంగా వేధింపులు మొదలు పెట్టిందన్నారు. గత ప్రభుత్వంలో తమకు అనుకూలంగా పనిచేశారని వేధిస్తున్నారన్నారు. మణి, వేణు, రాజా, చందన్‌కుమార్, సంఘమిత్రలు పాల్గొన్నారు.

## స్వర్ణాంధ్ర సాధనకు కృషి

ఏర్పేడు, అక్టోబరు 7: స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంగా చేపడుతున్న అభివృద్ధికి ప్రతి పౌరుడు సహకరించాలని మడిబాక సర్పంచ్ చెంగల్రాజు అన్నారు. రాజులకండ్రిగలో టీడీపీ నాయకుడు డి.మాధవరాజు చేతుల మీదుగా తడి, పొడి చెత్త సేకరణకు ప్లాస్టిక్ బుట్టలను పంపిణీ చేశారు.

## ఆ భూములు మాకు అప్పగించండి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

కేవీబీపురం, అక్టోబరు 7: తమ అనుభవంలో ఉన్న భూములను తమకు అప్పగించాలని కేవీబీపురం గిరిజనకాలనీ గిరిజనులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఐ తిరుపతి జిల్లా కార్యదర్శి మురళి మాట్లాడుతూ... సర్వే నెం.212, 213లో 6.10ఎకరాల భూమిని 20 కుటుంబాల గిరిజనులు 40 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నారని చెప్పారు. కొందరు ఆ భూమిలో ట్రాక్టర్లతో దున్నకానికి యత్నించారన్నారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. రాధాకృష్ణ, జె.గురవయ్య, కె.ఫల్గున, గుణ, చిన్నిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

### ఎస్టీల భూమిని కాపాడండి

ఏర్పేడు మండలం ముసలిపేడులో ఎస్టీలకు చెందిన 8 ఎకరాల భూమిని గత ప్రభుత్వంలో అధికారులను అడ్డం పెట్టుకుని రికార్డులు తారుమారు చేసి కబ్జా చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు.

## వాహనం ఢీకొని ఒకరి మృతి

రేణిగుంట, అక్టోబరు 7: రోడ్డు దాటుతుండగా వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు... తిమ్మినాయుడుపాళెంకు చెందిన లింగయ్య(55) సోమవారం రాత్రి కరకంబాడి రైల్వే గేట్ వద్ద రోడ్డు దాటుతుండగా వాహనం ఢీకొనడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని రుయాఆస్పత్రికి తరలించారు. రేణిగుంట అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

## వెన్నుపోటు పొడిచిన వారిని పార్టీలో చేర్చుకోం

### టీడీపీ తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహయాదవ్

తిరుపతి, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి) : గత ఎన్నికల ముందు వైసీపీలోకి వెళ్లిన తెలుగు మహిళ తిరుపతి పార్లమెంటు అధ్యక్షురాలు చక్రాల ఉష తాజాగా విజయవాడలో టీడీపీ యువనేత, మంత్రి నారా లోకేశ్, రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కలవడం దుమారం రేపింది. తిరిగి సొంత గూటికి వస్తున్నట్లు సంకేతాలిస్తూ ఆమె మీడియాతో పాటు సోషల్ మీడియాలోనూ లోకేశ్‌తో ఉన్న ఫొటోలు షేర్ చేశారు. ఇది శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి అనుచరులకు ఆగ్రహం తెప్పించింది. గుర్తింపునిచ్చిన పార్టీని వదిలి వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఎన్నికల సమయంలో వైసీపీ కండువా కప్పుకున్న ఉషను ఎట్టి పరిస్థితుల్లోనూ పార్టీలోకి తీసుకోవద్దని మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ పరిణామాలను నరసింహ యాదవ్ సోమవారం రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు ఫోనులో వివరించినట్లు తెలిసింది. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఎన్నికల ముందు వైసీపీలో చేరిన ఎవ్వరినీ చేర్చుకోబోమని ఆంధ్రజ్యోతికి చెప్పారు.

## గుడిమల్లం ఆలయానికి ఏపీ టూరిజం బస్సులు



భక్తులకు స్వాగతం పలుకుతున్న అధికారులు

ఏర్పేడు, అక్టోబరు 7: దేశంలోని మొట్టమొదటి శివాలయంగా గుర్తింపు పొందిన గుడిమల్లం పరశురామేశ్వరస్వామి ఆలయానికి తిరుపతి నుంచి ఏపీ టూరిజం బస్సులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మొదటిసారిగా టూరిజం బస్సులో వచ్చిన భక్తులను సాదరంగా ఆహ్వానించారు. ఆలయ మాజీ ఛైర్మన్ గిరినాయుడు, ఈవో రామచంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ పద్మనాభనాయుడు పాల్గొన్నారు.

## టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి రోశయ్య మృతి



సత్యవేడు, అక్టోబరు 7: మండలంలోని రాజగోపాలపురానికి చెందిన టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి, ఆడిటర్ మాచర్ల రోశయ్య(48) మృతి చెందారు. ఇటీవల అస్వస్థకు గురైన రోశయ్యను కుటుంబ సభ్యులు చెన్నైలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ఈ క్రమంలో ఆయన ఆరోగ్యం విషమించి మృతి చెందారు. రోశయ్యకు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. కాగా రోశయ్య భార్య రాధిక రాజగోపాలపురం సర్పంచ్‌గా పనిచేశారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో రోశయ్య సత్యవేడు నుంచి జడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేశారు. రోశయ్య మృతి పట్ల టీడీపీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

## మెరుగైన వైద్యసేవలందించండి



అన్నక్యాంటీన్‌లో బృందమ్మ

శ్రీకాళహస్తి, అక్టోబరు 7: ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలందించాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బృందమ్మ చెప్పారు. ప్రభుత్వా స్పత్రిలోని డయాలసిస్, కాన్పుల వార్డు, ఓపీ విభాగాలను పరిశీలించారు. వైద్యులు నిరంతరం అందుబాటులో ఉంటూ నాణ్యమైన సేవలందించాలని కోరారు. అనంతరం అన్న క్యాంటీన్‌కు వెళ్లి భోజనం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అనుమతి లేనిదే ఇసుక, మట్టిని తరలించొద్దు

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 7: అనుమతులు లేనిదే ఇసుక, మట్టిని తరలించకూడదని తహసీల్దార్ సుబ్రమణ్యం తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో ఇసుక, మట్టి తరలింపుపై అధికారుల నుంచి అభిప్రాయాలను తెలుసుకున్నారు. మట్టి అనుమతులు కోసం ఇరిగేషన్, వీర్వోలు, కార్యదర్శులు అనుమతులు తీసుకున్న తరువాత... ఉదయం 6నుంచి మధ్యాహ్నం 1గంట వరకే తరలించాలన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన పనులకు సంబంధిత ఏఈ నుంచి లిఖిత పూర్వకంగా తీసుకువస్తేనే అనుమతులిస్తామన్నారు. ఎంపీడీవో త్రివిక్రమరావు, ఎస్‌ఐ విశ్వనాథనాయుడు, డీటీ చంద్రబాబునాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు సుధాకరనాయుడు, ఏఈలు పాల్గొన్నారు.

## రెజ్లింగ్ పోటీల్లో బాలికల సత్తా



రేణిగుంట, అక్టోబరు 7: రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో రేణిగుంట జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు సత్తా చాటారు. ఈనెల 3, 5 తేదీలలో కృష్ణా జిల్లా నున్నలో జరిగిన రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో అండర్-19 విభాగంలో బంగారు పతకం, రెండు కాంస్య పతకాలు, అండర్ -14లో రెండు రజతాలు, కాంస్య పతకం సాధించి ఓవరాల్ ఛాంపియన్ షిప్ కైవసం చేసుకున్నారు. క్రీడాకారులను పాఠశాల హెచ్‌ఎం విష్ణువర్ధిని, పీడీ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ అభినందించారు.

## బీజేపీ సభ్యత్వ నమోదు



శ్రీకాళహస్తి, అక్టోబరు 7: పట్టణంలోని 109వ బూత్ పరిధిలో సోమవారం బీజేపీ సభ్యత్వ నమోదు జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు చంద్రప్ప మాట్లాడుతూ... కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంతో దేశం అభివృద్ధి చెందుతోందన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కండ్రిగ ఉమ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## విజయవాణి ప్రింటర్స్ పిల్లల పుస్తకాలకు అవార్డు



అవార్డుతో చంద్రశేఖర్‌మూర్తి

పుంగనూరు, అక్టోబరు 7: తెలుగు పిల్లల పుస్తకాలకు రూమ్ టు ఇండియా ట్రస్ట్, యూఎస్ఏఐడీ యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో చిత్తూరు జిల్లా చౌడేపల్లె విజయవాణి ప్రింటర్స్‌కు ప్రతిష్టాత్మకమైన అవార్డులు లభించాయి. సోమవారం న్యూఢిల్లీలోని గ్రాండ్ హోటల్‌లో నిర్వహించిన టీచర్, లైబ్రేరియన్ చాయిస్ అవార్డులను విజయవాణి ప్రింటర్స్ అధినేత చంద్రశేఖర మూర్తికి సంస్థ ప్రతినిధులు అందజేసి అభినందించారు. 8-12 సంవత్సరాల వయస్సు గల విభాగంలో 'విలువైన సాయం' పుస్తకం విజేతగానూ, 3-8 సంవత్సరాల వయస్సు గల విభాగంలో 'సీసాలో ఎలుక' పుస్తకం రన్నర్-అప్‌గానూ ఎంపికయ్యాయి. పిల్లల కోసం తెలుగుభాషలో విద్యతో కూడిన పుస్తకాల ప్రచురణ కృషికి గుర్తింపుగా ఈ అవార్డులు లభించాయని చంద్రశేఖర్‌మూర్తి తెలిపారు.